


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 283, పేజీలు - 08

మంగళవారం, మార్చి 31, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## తిరుపతిలో పీ4 వార్షికోత్సవం

- బంగారు కుటుంబాలతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ



తిరుపతి (ప్రశ్న న్యూస్) పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పేదరికంపై గెలుపు) కార్యక్రమం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ పథకాలకు భిన్నంగా, మానవతా దృక్పథంతో పేద కుటుంబాలను ఆదుకునే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని ఈ వేడుకల్లో వివరించారు. ఈ కార్యక్రమంపై రూపొందించిన ప్రత్యేక ఆడియో, వీడియో (ఏవీ) ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. పీ4 కార్యక్రమం ద్వారా గత

2లో..

# ఆహార కల్తీలపై ఉక్కుపాదం

## - ఈగల్, హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటుకు రెడీ

- ఆహార కల్తీ కట్టడికి సరికొత్త వ్యవస్థ
- దేశంలోని చట్టాలను అధ్యయనం చేసి పగడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడి
- రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దత్తు ధర చట్టం తెచ్చామన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రస్తుత సమాజంలో అసలు కంటే నకిలీలే ఎక్కువై పోతున్నాయి. వస్తువుల దగ్గరి నుంచి ఆహార పదార్థాల వరకు అన్నీ కల్తీ చేసేస్తున్నారు. ఆహార కల్తీ రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సంపాదించేందుకు ఆహార పదార్థాలను కల్తీ చేసి మార్కెట్లలో అమ్ముతున్న ముఠాలు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయాయి. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఇటీవల భారీగా ఆహార కల్తీ పెరిగిపోవడం, క్వింటాళ్ల కొద్దీ కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుంటున్న ఘటనలు భారీగా పెరిగిపోవడంతో ప్రజల ఆరోగ్యం పట్ల భయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కల్తీరాయుళ్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా సోమవారం మీడియాతో చిట్ చాట్ మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఆహార కల్తీకి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈగల్, హైడ్రా వ్యవస్థల లాగానే తెలంగాణలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకురానున్నట్లు చెప్పారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఆహార భద్రతా చట్టాలు, వ్యవస్థలను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అధ్యయనం పూర్తైన తర్వాత కల్తీ దందాపై పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ మాఫియాకు గట్టి బుద్ధి చెబుతామని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈగల్, హైడ్రా వ్యవస్థలకు ఇచ్చినట్లే ఈ కల్తీలపై ఏర్పాటు చేసే కొత్త వ్యవస్థకు కూడా అపరిమిత అధికారాలు, టెక్నాలజీని అందించనున్నట్లు తెలుస్తోంది.

ఈ సందర్భంగా రైతుల సమస్యలపై స్పందించిన రేవంత్ రెడ్డి కష్టపడి పండించిన పంటకు ధర నిర్ణయించే అవకాశం కూడా అన్నదాతకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు పూర్తిగా వారిని దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అన్నదాతల హక్కులను రక్షించేందుకు కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అదే సమయంలో నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు

2లో..

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది

- కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు



**అదూర్ (ప్రశ్న న్యూస్)** కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) – కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు. పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే

2లో..

# ఏపీలో 2.50 లక్షల గృహప్రవేశాలు



## - ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తానన్న సీఎం

- నాయుడుపేట వేదికగా పేదలకు ఇళ్ల పంపిణీ చేసిన సీఎం
- తన జన్మ ధన్యమైందంటూ ముఖ్యమంత్రి భావోద్వేగం
- పేదలు గౌరవప్రదమైన ఇళ్లలో ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో పేదల గృహ నిర్మాణ రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. పేదవాడి సొంత ఇంటి కల నెరవేరడం ఒక పండుగ అని సీఎం అభివర్ణించారు. మొత్తం 2,50,893 కుటుంబాలకు గృహప్రవేశం చేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపామని పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 12న జరిగిన మొదటి విడతలో 3 లక్షల ఇళ్లను పంపిణీ చేయగా, ఇప్పుడు

2లో..

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

## - గవర్నర్ ను కోరిన బీఆర్ఎస్ నేతలు

- మంత్రి పొంగులేటిపై అవినీతి ఆరోపణలు చేసిన బీఆర్ఎస్
- అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై విచారణ జరపాలని డిమాండ్
- కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్ ను కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై అక్రమ మైనింగ్, భూ కబ్జా ఆరోపణలు ఉన్నాయని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం సోమవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. మంత్రికి సంబంధించిన అక్రమ మైనింగ్, భూ కబ్జాలపై ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మంత్రికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. జంట జలాశయాల పరిరక్షణ ప్రాంతాల్లో సైతం మైనింగ్ చేస్తోందని, దీనికి సంబంధించి కనీస అనుమతులు కూడా తీసుకోలేదని పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో వివరించింది. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారే తప్ప ప్రభుత్వం స్పందించలేదని నేతలు అన్నారు.

2లో..

## అమరావతిలో హై అలర్ట్

- ఆరు చెక్‌పోస్టు, డ్రోన్లతో భద్రత కట్టుదిట్టం



2లో..

# లక్షల కోట్ల ప్రజాధనం వృథా

- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక విమర్శలు
- ప్లానింగ్ లోపాలే కారణమని వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజ్యసభలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై జరిగిన చర్చలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వైఫల్యాలకు ప్రధాన కారణం ప్లానింగ్, డిజైన్ లోపాలేనని ఆయన స్పష్టం చేశారు. కేవలం సరైన ప్రణాళిక లేకపోవటం వల్ల లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆయన సభలో వెల్లడించారు. ఒక భారీ సాగునీటి ప్రాజెక్టును నిర్మించేటప్పుడు

2లో..

## కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం

- కేసీఆర్ ఉండటం వల్లే తనకి గుర్తింపున్న సీఎం రేవంత్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారని కానీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమో అనేది తన అనుమానం అని అన్నారు. రావణుడి వల్లే రాముడి గొప్పతనం ఏమిటో తెలిసిందని అలాగే కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని చెప్పారు.

2లో..

## 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం

- 100 రోజుల ట్రైనింగ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రతీ ఒక్కరికీ చదువు అవసరం. ఉద్యోగాలు చేయకపోయినా చదవడం, రాయడం వంటి కనీస ప్రక్రియలైనా రావాలని చెబుతూ ఉంటారు. నిరక్షరాస్యులుగా ఉన్న వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే

2లో..

## సర్కారును నిలదీసిన రాములమ్మ

- ఉద్యమకారులు లేకుంటే సీఎంలు, మంత్రులు అయ్యేవారా
- కమిటీల పేరుతో కాలయాపన వద్దని రేవంత్‌కు సూచన
- మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి కీలక వ్యాఖ్యలు



2లో..

## ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే 'హేట్ స్పీచ్' బిల్లు

- బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకు ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఒక 'క్రూరమైన ఆయుధం' అని ఆయన అభివర్ణించారు. వాళ్లను విమర్శించే

2లో..

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు

- బ్యాంకింగ్ నిబంధలనపై నిర్మలమ్మ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా

2లో..

## అణు దాడికి ఐరాసలోనే ప్లాన్

- ఇరాన్‌పై అణుదాడికి సన్నాహాలు.?
- ఐరాసలో పదవికి రాజీనామా చేసిన దౌత్యవేత్త



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త మహమద్ సఫా తన పదవికి రాజీనామా చేస్తూ, సంచలన ఆరోపణలు చేశారు. ఇరాన్‌పై అణ్వాయుధాలు ప్రయోగించేందుకు ఐక్యరాజ్యసమితిలోని ఓ వర్గం మద్దతు ఇస్తోందని, ఈ మానవత్వ వ్యతిరేక నేరంలో తాను భాగస్వామిని కాలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో ఒక లేఖ ద్వారా ఆయన వెల్లడించారు. "ఇరాన్‌పై అణుదాడికి

2లో..

# తిరుపతిలో పీ4 వార్షికోత్సవం

ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10.39 లక్షల పేద కుటుంబాలను 'మార్గదర్శులు' దత్తత తీసుకున్నట్లు ఏపీలో వెల్లడించారు. వీరిలో ఇప్పటికే 2.1 లక్షల కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురాగలిగామని తెలిపారు. సమాజంలోని ధనిక వర్గాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు 'మార్గదర్శులు'గా వ్యవహరిస్తూ పేద కుటుంబాలను 'బంగారు కుటుంబాలు'గా దత్తత తీసుకుంటున్నారు. వారికి జీవనోపాధి మార్గాలు చూపడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ, పిల్లల చదువుకు చేయూత, గృహ నిర్మాణం వంటి అనేక రూపాల్లో సహాయం అందించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మార్గదర్శులు, లబ్ధి పొందిన బంగారు కుటుంబాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నేడు లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాలు భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే మార్గదర్శకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కేవలం ప్రభుత్వ పథకాలతోనే కాకుండా, పౌర సమాజ భాగస్వామ్యంతో పేదలను పైకి తీసుకురావాలనే ఆలోచన అద్భుతమని పలువురు మార్గదర్శకులు ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త సామాజిక మార్పుకు నాంది పలుకుతోందని అభిప్రాయపడ్డారు.

# ఆహార కల్తీలపై ఉక్కుపాదం

రేషన్ కింద దొడ్డు బియ్యం సరఫరా చేయడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించి సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం 86 శాతం ప్రజలు సన్నబియ్యాన్ని పొందుతున్నారని అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసినట్లు స్పష్టం చేశారు. ఇలా చేయడం వల్ల రైతులకు లాభం చేకూర్చడమే కాకుండా పేదల ప్రజలకు సన్నబియ్యంతో ఆకలి తీరుస్తున్నామని వెల్లడించారు. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గిందని వాణిజ్య పంటలవైపు అన్నదాతలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది

మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

## మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయండి

రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు ప్రభుత్వం సభలో అంగీకరించడమే అక్రమాలకు నిదర్శనమని వారు వెల్లడించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నందున సీఐడీ వంటి రాష్ట్ర ఏజెన్సీలపై తమకు నమ్మకం లేదన్నారు. పొంగులేటి మంత్రిగా కొనసాగితే విచారణను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి ఆయన్ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కోరారు. అవినీతి ఆరోపణలపై విచారణ జరిపిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే పొంగులేటి వ్యవహారంతో పాటు అమృత్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్, సింగరేణి అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన విమర్శించారు.

# ఏపీలో 2.50 లక్షల గృహప్రవేశాలు

రెండో విడతలో భాగంగా లక్ష టిడ్కో ఇళఅలు, మరో లక్షా యాభై వేల సాధారణ గృహాలను కలిపి మొత్తం రెండున్నర లక్షలకుపైగా ఇళ్లను ప్రభుత్వం అందించింది. కేవలం ఇల్లు ఇవ్వడమే కాకుండా, దానిని ఒక ఆస్తిగా పేదలకు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచాలని సీఎం ఆకాంక్షించారు. ముఖ్యంగా ధనిక వర్గాలు నివసించే తరహాలో అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లను నిర్మించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని సాధించాలనే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే రెండు విడుతల్లో దాదాప 5.50 లక్షల ఇళ్లను పూర్తి చేసింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మరో 4.50 లక్షల ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకుంది. మొత్తంగా పది లక్షల ఇళు మైలురాయిని చేరుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. టెక్నాలజీ ఉపయోగించి పారదర్శకంగా ఈ పథకాలను అమలు చేస్తున్నట్టు సీఎం తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి, మరుగుదొడ్డి, విద్యుత్ సౌకర్యంతోపాటు గ్యాస్ కనెక్షన్ కూడా అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. టిడ్కో గృహ సముదాయాల్లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు వంటి ఆధునిక వసతులను కల్పించారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అర్బన్ హౌసింగ్ కింద ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. నివాసయోగ్యం కానీ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దాదాపు 816 కోట్ల రూపాయలు అప్పులు మిగిల్చారని వివరించారు. లబ్ధిదారులు చెల్లించిన 174 కోట్ల రూపాయలను సైతం గత ప్రభుత్వం మాయం చేసిందని, అయితే తమ ప్రభుత్వం ఆ మొత్తాన్ని తిరిగి 82 వేల కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. వ్యవస్థలను అస్తవ్యస్తం చేసినా, తాము వాటన్నింటినీ సరిదిద్ది సుపరిపాలన అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమై అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని అమరావతిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు తెలిపారు. చట్టం రూపం దాల్చిన తర్వాత రాజధానిని ఎవరూ కదల్చలేరని స్పష్టం చేశారు. హైదరాబాద్, చెన్నై నగరాల కంటే అద్భుతంగా అమరావతిని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పోలవరం నాశనమైందని, అయితే గోదావరి పుష్కరాల కంటే ముందే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని గడువు విధించారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్టు సీఎం వివరించారు. 63 లక్షల మందికి ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దే పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఎంతో మంది పిల్లలున్న తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నట్టు తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం, యువతకు ఉద్యోగ అవకాశాలు, వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే సాయాన్ని 20 వేలకు పెంచామన్నారు. ఈ ఏడాది 5 లక్షల మంది మహిళలకు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, రాబోయే ఎన్నికల్లో మహిళలకు సీట్లు పెంచుతామని సీఎం ప్రకటించారు.

### ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలు

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వంటి టెక్నాలజీ విధానాలను ప్రవేశపెట్టినట్టు సీఎం తెలిపారు. ఏప్రిల్ నుంచి తాను స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, ఎమ్మెల్యేల పని తీరు బాగుండకపోతే ఊరుకునేది లేదని చంద్రబాబు హెచ్చరించారు.

# అమరావతిలో హై అలర్ట్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. రాజధాని నగర పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కీలక ప్రకటన విడుదల చేశారు. రాజధాని ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న కొన్ని అవాంఛనీయ ఘటనలు, అమరావతి నిర్మాణం తిరిగి ఊపందుకుంటున్న వేళ విద్రోహక శక్తులు తలదూర్చకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ హై అలర్ట్ ప్రకటించినట్టు తెలుస్తోంది. ఈ భద్రతా వ్యూహంలో భాగంగా తక్షణమే అమలులోకి వచ్చేలా ఆరు ప్రధాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కేవలం పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం ఈ కొత్త ప్రోటోకాల్ ప్రధాన ఉద్దేశం. రాజధాని లోపలికి వచ్చే, బయటకు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసేందుకు 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీని వల్ల అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఆధునిక సాంకేతికతను జోడించి, రాత్రి సమయాల్లో క్షేత్రస్థాయిలో పోలీసులు వెళ్లలేని ప్రాంతాలను సైతం గమనించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్ కెమెరాలు నిరంతరం ఆకాశం నుంచి నిఘా వేసి, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. పోలీసు వాహనాలు నిరంతరం రాజధాని రహదారులపై గస్తీ తిరుగుతూ ఉంటాయి. ఇది నేరస్తుల్లో భయం కలిగించడమే కాకుండా, స్థానికుల్లో, నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో భద్రతా భావాన్ని కల్పిస్తుంది.

### నిర్మాణ సంస్థలకు కఠిన ఆదేశాలు

అమరావతిలో ప్రస్తుతం అనేక నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయా నిర్మాణ సంస్థలకు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాజధాని ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం పోలీసులదే కాదని, సంబంధిత సంస్థలు కూడా సహకరించాలని పోలీసులు పేర్కొన్నారు. ప్రతి నిర్మాణ ప్రాంగణంలో హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. నిర్మాణ సంస్థలు తమ సొంత సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకొని, పగలు, రాత్రి వేళల్లో గస్తీ కాయాలి. నిర్మాణ సమయంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ హెచ్చరించారు.

# లక్షల కోట్ల ప్రజాధనం వృథా

అనుసరించాల్సిన ప్రాథమిక సూత్రాలను విస్మించడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని కేంద్రం ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఈ లోపాలను, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోందని పాటిల్ తెలిపారు. ఈ బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రాజెక్టులో జరిగిన సాంకేతిక లోపాలు మరింత స్పష్టంగా బయటపడే అవకాశం ఉంది. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే కాకుండా రాష్ట్రంలో తాగు నీటి సరఫరాకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. తెలంగాణ వద్ద ప్రస్తుతం జల్‌జీవన్ మిషన్ నిధులు 873 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కేవలం 194 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గత మూడేళ్లుగా జల్‌జీవన్ మిషన్ అమలుకు సంబంధించిన తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి ఒక్క ప్రతిపాదన కూడా అందలేదన్నారు.

### ప్రపంచంలోనే అతి పెద్ద ఇంజనీరింగ్ అద్భుతం నుంచి ఆర్థిక భారంగా

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. దీన్ని 2016-2019 మధ్య కాలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం జరిగింది. గోదావరి నది జలాలను ఎత్తిపోసి, తెలంగాణలోని 13 జిల్లాల్లో సుమారు 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు, మరో 18.82 లక్షల ఎకరాలకు పాత ఆయకట్టు స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టుపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే మూడు ప్రధాన బ్యారేజీలు ఉన్నాయి. మొత్తం 15 రిజర్వాయర్లతో 140-148 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. 20 లిఫ్ట్ స్టేషన్లలో 82 భారీ పంపును అమర్చారు. 1531 కిలోమీటర్ల పొడవైన కాలువలు, 203 కిలోమీటర్ల మేర భూగర్భ సొరంగాలు నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రోజూ 2 టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు మొత్తం 180 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. ఇందులో సాగునీటికి 134.5 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30టీఎంసీలు, హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 30 టీఎంసీలు, పరిశ్రమలకు 16 టీఎంసీలు కేటాయించారు. ప్రాజెక్టు ప్రారంభంలో అంచనా వ్యయం 80,500 కోట్లు ఉండగా, కాలక్రమేణా అది 1.47 లక్షల కోట్ల వరకు పెరిగిందని కాగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2023లో కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన భాగమైన మేడ గడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది కేవలం నిర్మాణ లోపమే కాకుండా, మొత్తం ప్రాజెక్టు డిజైన్, ప్లానింగ్‌లోనే లోపాలు ఉన్నాయని కేంద్రంతోపాటు, రాష్ట్రం నియమించిన ఘోష్ కమిషన్ అభిప్రాయపడింది. ఘోష కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఈ కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇప్పుడు కేంద్రం వద్ద ఇది పెండింగ్‌లో ఉంది. ఇంతలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ చేసిన కామెంట్స్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి.

## కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం

నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని, లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీట్ల పెంపులో ఈ వ్యత్యాసం కొనసాగితే భవిష్యత్తులో బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి నేతలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు పెరుగుతాయని సెటైర్లు వేశారు.

# అణు దాడికి ఐరాసలోనే ప్లాన్

ఐక్యరాజ్యసమితి 'సహకారం' అందిస్తోందన్న విషయాన్ని ప్రజలు గ్రహించడం లేదు. టెహ్రాన్ ఒక ఖాళీ ఎడారి కాదు. అక్కడ కుటుంబాలు, పిల్లలు, కలలు కనే మనుషులు ఉన్నారు. యుద్ధం కోరుకునే వారు మానసికంగా అనారోగ్యంతో ఉన్నట్టే" అని సఫా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సుమారు కోటి మంది జనాభా ఉన్న టెహ్రాన్‌పై అణుదాడి చేస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని, వాషింగ్టన్, బెర్లిన్, లండన్ వంటి నగరాలపై ఇలాంటి దాడి జరిగితే పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ నిజాన్ని బయటపెట్టడం కోసమే తన దౌత్యపరమైన కెరీర్‌ను వదులుకున్నానని, ముప్పు ఏర్పడకముందే దీన్ని ఆపాలని ప్రపంచ ప్రజలకు పిలుపునిచ్చారు. మహమద్ సఫా 2016 నుంచి 'పేట్రియాటిక్ విజన్' (పీవీఏ) అనే అంతర్జాతీయ సంస్థకు ఐక్యరాజ్యసమితిలో ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థకు ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలిలో ప్రత్యేక సలహా హోదా ఉంది. 2013 నుంచి ఆయన పీవీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. గత మూడేళ్లుగా తాను ఎంతో ఓపిక పట్టానని, 2023లోనే రాజీనామా చేయాలని భావించినట్లు సఫా చెప్పారు. 2023 అక్టోబర్‌లో హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తర్వాత తన అభిప్రాయాల కారణంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్‌ను విమర్శించడానికి ఐక్యరాజ్యసమితిలోని కొందరు సీనియర్ అధికారులు ఇష్టపడటం లేదని ఆయన ఆరోపించారు. ఒక 'శక్తివంతమైన లాబీ' కొత్త ప్రపంచ వ్యవస్థను సృష్టించిందని, దానికి కొందరు ఐక్యరాజ్యసమితి అధికారులు 'సేవ' చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాల తర్వాత తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మరణ బెదిరింపులు వచ్చాయని సఫా వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో నేరుగా కాకపోయినా, సదరు లాబీకి 'సేవ' చేస్తున్న అధికారుల ద్వారా సెన్సార్‌షిప్‌ను ఎదుర్కొన్నట్లు ఆయన ఆరోపించారు. సఫా చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై ఐక్యరాజ్యసమితి ఇంకా స్పందించలేదు. మధ్యప్రాచ్యంలో ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు

బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

## ప్రజాస్వామ్య గొంతును

# నొక్కేందుకే 'హేట్ స్పీచ్' బిల్లు

వారి నోళ్లు మూయించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ బిల్లు గనుక చట్టరూపం దాల్చితే, రాజ్యాంగం పౌరులకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య వ్యవస్థ మూలాలకే పెను ముప్పు వాటిల్లుతుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినా, దానికోసం తీసుకొస్తున్న ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు.

"ఈ బిల్లు రూపకల్పనను పరిశీలిస్తే, అమలు యంత్రాంగం వాస్తవ ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బిల్లులో పొందుపరిచిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ నిర్వచనం, పరిమితులు లేవని ఆయన ఎత్తిచూపారు.

ఈ పదజాలం ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా ఉంచారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఇలా చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను విమర్శిస్తే, వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికే దేశంలో విద్వేష ప్రసంగాలను అరికట్టేందుకు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) వంటి చట్టాలు బలంగా ఉన్నాయని గుర్తుచేశారు. "ఇప్పటికే తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ కొత్త చట్టం తీసుకురావడంలో ప్రభుత్వ ఆంతర్యం ఏమిటి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సర్కారును నిలదీసిన రాములమ్మ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి తమ సొంత ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అహర్నిషలు పోరాటం చేసిన ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె శాసనమండలిలో డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం పోరాటం చేసి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఆ కుటుంబాలకు నెలకు రూ.25 వేల చొప్పున పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారులపై రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని అదే విధంగా ప్రభుత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తామని తమ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన విజయశాంతి అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు పూర్తి అయిపోయినా. తెలంగాణ ఉద్యమకారులకు మాత్రం ఇంకా న్యాయం జరగలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇప్పుడు ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్న ఎమ్మెల్సీ విజయశాంతి వారికి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే ప్రస్తుతం తెలంగాణలో సీఎంలు గానీ, మంత్రులు గానీ ఉండేవారా అని విజయశాంతి నిలదీశారు. పదవుల కంటే ముందు ఉద్యమకారులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన తప్పనిసరి బాధ్యత అని విజయశాంతి గుర్తు చేశారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ సర్కార్ సరిగ్గా నిర్వర్తిస్తేనే అది చరిత్రగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలా కాకుండా ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది పెద్ద చారిత్రక తప్పిదంగా చరిత్రలో మిగిలిపోతుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవంతోపాటు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందని విజయశాంతి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సున్నితమైన హెచ్చరికలు చేశారు.

# 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం

లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఇందులో భాగంగానే చదువుకోని, నిరక్షరాస్యులైన మహిళలను మహిళా సంఘాల ద్వారా గుర్తిస్తున్నారు. అలాంటి వారికి 100 రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి ఆ తర్వాత పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో అనేక మంది మహిళలు ఆసక్తి చూపించారు. ఈ నేపథ్యంలోనే మహిళలకు 100 రోజుల పాటు ఆయా స్కూళ్లలో వాలంటీర్లు బోధన చేశారు. ఇలా వంద రోజుల పాటు శిక్షణ తీసుకున్న తర్వాత ఆ మహిళలకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పరీక్షలు చేపట్టారు. అందులో భాగంగానే నిర్మల్ జిల్లాలో ఏకంగా 18 వేల మంది మహిళలు ఆదివారం రోజున విజయవంతంగా పరీక్షలు రాశారు. ఇక ఈ ఎగ్జామ్ సెంటర్లను నిర్మల్ డీఈఓ భోజన్నతో పాటు విద్యాశాఖ అధికారులు కూడా సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన ఈ పరీక్షకు 836 మంది మహిళలు హాజరైనట్లు ఏపీఎం వినేష్ వెల్లడించారు. మరోవైపు జగిత్యాల జిల్లాలో అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాల ద్వారా గుర్తించిన నిరక్షరాస్యులైన మహిళలకు వాలంటీర్లు చదవడం, రాయడం నేర్పించారు. ఇక ఇలా ట్రైనింగ్ తీసుకున్న మహిళలకు వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లాస్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న 5 మున్సిపాలిటీల నుంచి సుమారు 900 మంది మహిళలు హాజరయ్యారు. తాము చదువుకుని ఈ స్థాయికి చేరేందుకు ఎంతో కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు మహిళలు ధన్యవాదాలు చెప్పారు. ఇక ఈ 100 రోజుల బోధనలో భాగంగా మహిళలకు పలు అంశాలను నేర్పిస్తారు. మన ఆచార వ్యవహారాలు, మా ఇంటి మహాలక్ష్మి, పిల్లల పెంపకం-మన బాధ్యత, కుటుంబం-ఇరుగుపొరుగు, పరిశుభ్రత-ఆరోగ్యం, ఎన్నికలు, చట్టాలు తెలుసుకుందాం, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలకు అనుగుణంగా తెలుగు భాష, రోజువారీ పనుల్లో ఉపయోగపడే లెక్కలకు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో పుస్తకాలను తయారు చేశారు.

## అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట

# శ్రీ కోదండరామస్వామి కళ్యాణం

**- అధికారులకు మంత్రి సవిత పిలుపు**

**ఒంటిమిట్ట / తిరుపతి,** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఒంటిమిట్టలోని టీటీడీ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం ఆమె జిల్లా మరియు టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా సమర్పించే పట్టు వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఏర్పాట్ల వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ, జిల్లా మరియు పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతల స్వీకరణ

**- చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు**

**- ఆరుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు, సభ్యులుగా కే.జీ వెంకట పద్మలత, డా. ధోని శ్రీనివాస్ మూర్తి, ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన రావు, మండల గంగ సూర్యనారాయణ, పి.నాగ మానస సోమవారం రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సెక్రటరీ ఉమాదేవి సమక్షంలో నూతన చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్రటరీ, సిబ్బంది నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పనిచేస్తామని తెలిపారు. సభ్యులు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ని నిలుపుతామన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే తక్షణమే కమిషన్ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను చైర్ పర్సన్, సభ్యులు కోరారు.

# మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

**- రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడి వైద్య సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, సౌకర్యాలపై రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని లాబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షా విధానాన్ని పరిశీలించి, పరీక్షలు నాణ్యతగా నిర్వహించాలని సూచించారు.

అలాగే మందుల గిడ్డంగిని తనిఖీ చేసి, అవసరమైన అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసు కున్నారు. రక్త పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షల వివరాలు, అందుబాటులో ఉన్న టీకాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవల స్థితిగతులు, అవసరమైన ఔషధాల లభ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుక్క కాటుకు గురైన ఒక బాలుడిని పరామర్శించి, అతనికి అందిస్తున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది షిఫ్టుల వారీగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీ లో మెడికల్ ఆఫీసర్ స్వప్న, టిపిఎమ్ఓ, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించిన విడిచి పెట్టేది లేదు బూడిది గణేష్

- ప్రభుత్వ భూమిని అనుభవించడానికి చూస్తున్న లెక్కల కిషన్ రెడ్డి లెక్కల లక్ష్మారెడ్డి.
- ఆ ఇద్దరి రైతులకు ప్రభుత్వ భూమి దొరికిందా? ఇక ఏమి కనబడటం లేదా?
- ప్రభుత్వ భూమి అయితే ఎవరు ఏమీ చేయలేరని? ఆ రైతుల ధీమాన.?





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏ క్లాస్ పూర్ గ్రామంలో గల గవర్నమెంట్ రైతు వేదిక వెనకాల గల 333 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో గల దాదాపు 5 ఎకరాల భూమిని స్థానిక ఇద్దరు రైతులు వాక్ పై చేసుకోవడానికి కన్ను వేసినారు ఆ రైతులలో లెక్కల కిషన్ రెడ్డి, లెక్కల లక్ష్మారెడ్డి, ఇద్దరు రైతులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని దర్జాగా అనుభవించడానికి చూస్తున్నారు రెవెన్యూ డిపార్ట్మెంట్ కు అధికారులకు ఈ విషయం కనబడటం లేదా? కనబడ్డ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా? ఎమ్మార్వో డిపార్ట్మెంట్కు ఏమన్నా మామూలు ముట్టాయి దీని వెనకాల బడా బాబుల హస్తం గిట్ల ఉందా అధికారులు కనుసనల్లోనే జరుగుతుందా అని బూడిది గణేష్ తీవ్రంగా ఖండించారు ఇలాంటి ప్రభుత్వ భూమిని ఎవరు వాగ్ పై చేసినా వదిలి పెట్టేది లేదని జిల్లా సిఐటి అధ్యక్షులు బూడిద గణేష్ పేర్కొన్నారు ఈ భూమి విషయంలో కలెక్టర్ కూడా కలిసి మెమోరండం ఇస్తామని వారు పేర్కొన్నారు . పెద్దపెల్లి జిల్లా ఎగ్లాస్పూర్ లో పాడిపంటలకు కొదవలేదని పేద రైతులు పండించిన పంటను ఎక్కడికి తీసుకెళ్లాలని అయోమయంలో ఉన్నారు రైతులు అనేక ఇబ్బందులకు లోనవుతున్న రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామంలోని రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు ఎవరికి చెప్పుకోవాలి. అధికారులే కంచమేస్తే సామాన్య రైతులు ఎవరికి వారి బాధను చెప్పుకోవాలి వేలకు వేలు జీతాలు తీసుకుంటూ ప్రజలు పన్నుల రూపంలో కట్టే జీతాలని అనుభవిస్తూ మరి రైతులకే టోకరు వేసే వారిని అధికారులు ఎందుకు గుర్తించడం లేదనేది ప్రజల్లో ఎక్కడికి అక్కడ గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు ఇలాంటి అవినీతిపరులను ఏరి వేయడంలో పై అధికారులకు కనబడటం లేదా ? అధికారుల నిర్లక్ష్యమా ప్రభుత్వ నిర్లక్ష్యమా ప్రజల నిర్లక్ష్యమా. కొంతమంది నజరానా ప్రకటించి ఆ ఇద్దరు అందలం ఎక్కడానికి భూమిని కబ్జా చేసుకొని అనుభవించుదామని చూస్తున్నారు ఇలాంటి దృశ్చర్యలు ఏ గ్రామంలో జరగకూడదని ప్రజలు ఆ పోతున్నారు. ఇకనుండి అయినా ఇలాంటివి జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# యుద్ధం వద్దు - శాంతి ముద్దు

**పాడేరు :** స్థానిక డిగ్రీ కాలేజీలో ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య, ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో “యుద్ధం వద్దు - శాంతి ముద్దు×” అనే అంశంపై విస్తృత సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నర్సా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామ్రాజ్య ఆధిపత్యం నశించాలి, యుద్ధాల ప్రభావం భారత సామాన్య ప్రజలపై భారం మోపుతుందని, స్వాతంత్ర్య విదేశాంగ విధానం× (స్ట్రాటజిక్ ఆటానమీ / నాన్-అలైన్‌మెంట్ స్ఫూర్తి) అమలు ద్వారానే భారత ప్రయోజనాలు సాధ్యమవుతాయని నొక్కి చెప్పారు. సెమినార్‌లో మధ్యప్రాచ్యంలో (ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా సంఘర్షణ) మరియు ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు భారతదేశంపై తీవ్రమైన ప్రభావం పడింది. భారత్ తన అవసరాలలో ×సుమారు 85-90% క్రూడ్ ఆయిల్× దిగుమతి చేసుకుంటుంది. యుద్ధాల వల్ల ఆయిల్ ధరలు ౨100 బ్యారెల్‌కు చేరుకుంటే ఇంధన ధరలు పెరిగి ×ద్రవ్యోల్బణం× తీవ్రమవుతుంది. రవాణా, పరిశ్రమలు, విద్యుత్ ఖర్చులు పెరిగి సామాన్యుల జీవన వ్యయం భారీగా పెరుగుతుంది. రూపాయి విలువ తగ్గి, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ విస్తరిస్తుంది. ఉఆఖ వృద్ధి ×6.5-6.6%×కి పడిపోయే అవకాశం ఉంది. యుద్ధాల వల్ల ఎరువులు, వ్యవసాయ రసాయనాలు, ఎడిబుల్ ఆయిల్స్ (సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటివి) ధరలు పెరుగుతాయి.




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలో ఎరువుల సరఫరా లోపం వల్ల భారత వ్యవసాయం దెబ్బతిన్నట్లు, ప్రస్తుత సంఘర్షణలో కూడా ఇలాంటి ప్రమాదం ఉంది. ఆహార ధాన్యాలు, కూరగాయలు, పల్సెస్ ధరలు పెరిగి ×ఆహార ద్రవ్యోల్బణం× మరింత తీవ్రమవుతుంది. పేదలు, ఆదివాసీలు, గిరిజన సమాజాలు ఎక్కువగా ఇబ్బంది పడతారు. ఆర్థిక సంక్షోభం వల్ల నిరుద్యోగం పెరుగుతుంది. కార్మికులు, విద్యార్థులు, గ్రామీణులు, ముఖ్యంగా ఆదివాసీ సమాజాలు ఆర్థిక ఒత్తిడికి గురవుతారు. సామాజిక అసమానతలు, దారిద్ర్యం మరింత పెరిగి అస్థిరత ఏర్పడవచ్చు. సామ్రాజ్యవాద శక్తుల యుద్ధాల్లో భారత్ పాల్గొనకుండా, స్వతంత్రమైన, స్వాతంత్ర్యపూర్వక విదేశాంగ విధానాన్ని అమలు చేయాలి. యుద్ధాలు మానవాళికి వినాశనం తప్ప మేలు చేయవు. శాంతి, సార్వభౌమత్వం, అభివృద్ధి కోసం సంభాషణల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి. ఈ సెమినార్‌లో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధ కృష్ణ అధ్యక్షత న జరిగింది. వాటతి జిల్లా కార్యదర్శి కె. కార్తీక్, చిన్నరవు మరియు విద్యార్థులు, ఆదివాసీ యువకులు, గిరిజన సమాజ సభ్యులు పాల్గొని యుద్ధాలకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యుద్ధాలు పేదలు, ఆదివాసీలు, సామాన్యులపైనే ఎక్కువ భారం మోపతాయని, శాంతి కోసం అన్ని వర్గాలు ఐక్యమవ్వాలని పిలుపునిచ్చారు.

## బ్రహ్మంగారుని దర్శించుకున్న బుల్లితెర నటులు



**బ్రహ్మంగారిమఠం** సోమవారం ఉదయం బుల్లితెర నటి నటులు జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సజీవ సమాధి దర్శనం చేసుకున్నారు. అనంతరం మఠాధిపతులు పూజ్యశ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాములవారిని దర్శించుకుని స్వామివారి దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. బుల్లితెర మీద నటించిన నటీనటులలో కుంకుమ పువ్వు సీరియల్ హీరోయిన్ ప్రిన్సీ కృష్ణన్ మరియు కార్తీక దీపం సీరియల్ కో డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి ఇతర క్యారెక్టర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి తమ్ముడు దత్తాత్రేయ స్వామి కూడా పాల్గొన్నారు.

## చల్లబసాయపల్లె లోనేడు రైతు సేవ కేంద్రం, హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం

**- మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ సంఘన హరినాధరెడ్డి**

**కడప** మండలంలోని చల్లభసాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవ కేంద్రం, హెల్త్ సెంటర్లను కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామ గోవింద్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు చల్లబసాయ పల్లె మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ సంఘన హరినాథ్ రెడ్డి తెలిపారు.

సోమవారం హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని చల్లబసాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవకేంద్రం, హెల్త్ క్లినిక్ సెంటర్ నూతన భవనం లను మంగళవారం ఎంపీ, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఉదయం 8.5గంటలకు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు అయన తెలిపారు. కావున సంబంధిత అధికారులు మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని హరినాధరెడ్డి తెలిపారు .

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా - ప్రజావాణి ఫిర్యాదులు 225**

**కరీంనగర్** ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్ డి ఆర్ డి ఓ శ్రీధర్ గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు పలు అధికారులు పాల్గొన్నారు.

## రైసు మిల్లర్ల నిర్లక్ష్యం.. ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు

**సూర్యాపేట** హుజూర్ నగర్ లో దారుణం జరిగింది. రైస్ మిల్లర్లు నిర్లక్ష్యంతో ముగ్గురు చిన్నారులకు కాలిన గాయాలయ్యాయి. నిత్యం రద్దీ, జనావాసాల మధ్య రైస్ మిల్లులు వున్నాయి. రైస్ మిల్లులోని బాయిలర్ నుండి వచ్చే నిప్పు కనికల బుడిదను రోడ్డు పై రైస్ మిల్లర్స్ వేసారు. ఈ ఘటనలో విశాల్ (10), నాగ యశ్వంత్ (11), యశ్వంత్ (13) కాలినట్లు సమాచారం. మొదటగా విశాల్ బూడిదలో కాలుతూ కేకలు వేయడంతో స్పందించిన మరో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు అయ్యాయి. కాలిన చిన్నారుల ఆర్తనాదాలు స్థానికుల హృదయాలను కలిసివేసింది. గాయపడ్డ చిన్నారులను మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ ఆసుపత్రులకు తరలించారు.

## అడ్లూరు గ్రామసభలో ఘర్షణ

**- పలువురికి గాయాలు**

**సూర్యాపేట** కోదాడ మండలం అడ్లూరు కాలనీ గ్రామసభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ గ్రామ నిధులు దుర్వినియోగం చేశారని ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు గ్రామ సభలో ప్రశ్నించడంతో ఘర్షణ తలెత్తింది. గ్రామస్థులు కర్రలతో కొట్టుకున్నారు. ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. గ్రామ సర్పంచ్ భర్త, మరియు సర్పంచ్ మామ వారి అనుచరులు కలిసి ఉప సర్పంచ్ ను వార్డు సభ్యులను కొట్టడంతో ఘర్షణ తలెత్తింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలను చెదరగొట్టి కొంతమందిని కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇరు వర్గాలు కాంగ్రెస్ పార్టీ కావడంతో, కాంగ్రెస్ పెద్దలు .. సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. .

## శరవేగంగా మల్లేశ్వరం ఐ ల్యాండ్‌లో కాటేజ్‌ల నిర్మాణం

**- 47.44 కోట్ల రూపాయలతో 30 కాటేజ్ ల నిర్మాణం**

**వనపర్తి** పనులను పరిశీలించిన జిల్లా పర్యాటక శాఖ కల్వరాల నరసింహ, గ్రామ సర్పంచ్ మధుగం బాలీశ్వరమ్మ నరసింహ. పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం ఐ ల్యాండ్ లో S+Snm స్కీం ద్వారా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో 47.44 కోట్ల రూపాయల నిధులతో 30 కాటేజ్ ల నిర్మాణానికి సంబదించిన పనులను నాగర్ కర్నూల్ ×జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మరియు మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ మధుగని నరసింహ పర్యవేక్షించారు. బికాటేజ్ ల నిర్మాణం పనులు డిసెంబర్ చివరి నాటికీ పూర్తి అయి 2027 సంవత్సరం నుంచి పర్యాటకులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని మల్లేశ్వరం ఐ ల్యాండ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారబోతుందని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ తెలియజేసారు.

## గుంతపల్లెలో నూతన విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం, బి.కోడూరు మండలం, గుంతపల్లె గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు శ్రీ నాభి శిలా గ్రామ దేవత పెద్దమ్మ తల్లి, పోతురాజు, శ్రీ పోలేరమ్మ తల్లి వారి నూతన విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కడప డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి సోమవారం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా:ఓబులాపురం రాజశేఖర్, ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి, మన్నే రాజశేఖర్ రెడ్డి, గోడి రమణా రెడ్డి, అరవ శ్రీనివాసులు రెడ్డి, పల్లె రమేష్ రెడ్డి, మాచుపల్లి కృష్ణారెడ్డి,చంద్రగిరి ప్రహ్లాద రెడ్డి, కల్లూరి దుగ్గిరెడ్డి, పామూరి బాలిరెడ్డి, ఓబులరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సిమెంట్ సుబ్బారెడ్డి, సాంబశివరెడ్డి,అలాగే గుంతపల్లె టీడీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాఘువ రెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, జమాల్ రెడ్డి, వీరశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, హర్షవర్ధన్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగురాళ్లలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీ

- పేదల సొంతిల్లు కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది
- ముఖ్య అతిథులుగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



**పిడుగురాళ్ల** పేదలు, మహిళల సొంత ఇల్లు కట్టుకోలేని నిరుపేదల కళ్ళలో ఆనందం చూడాలన్న లక్ష్యంతో సొంతింటి కల నెరవేర్చే దిశగా గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఏపీ టిట్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) మరియు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ( పీఎం ఏవై) ద్వారా నిర్మించి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణికి సిద్ధం అయిన 2,50,893 (రెండు లక్షల యాభై వేల ఎనిమిది వందల తొంబై మూడు) గృహలను ఈరోజు నెల్లూరు జిల్లా నాయుడుపేట నందు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏపీ టిడ్కో గృహలను పంపిణీ చేస్తున్న సందర్భంగా, గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణం, కొండమోడు కోనంకి రోడ్డు నందు నిర్మించిన టిడ్కో గృహల పంపిణీ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ డా.కృతికాశుక్లా, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, అర్డివో మురళీకృష్ణ, టిడ్కో డి.ఈ సేతు బాబు, హోసింగ్ డి.ఈ బాలాజీ నాయక్, గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖరరెడ్డి, పిడుగురాళ్ల మున్సిపల్ కమీషనర్ ఇరువూరి శ్రీనివాసరావు మరియు సంబందిత గృహ నిర్మాణ అధికారులు పాల్గొని 2832 గృహాలు మంజూరు అవ్వగా 1296 గృహలను లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చెయ్యటం జరిగింది.

# ఏపీ పోలీసులకు భారీ విజయం

**- మావోయిస్టు అగ్రనేత లొంగుబాటు**











**అమరావతి(ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుమారు 36 ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న సీపీఐ (మావోయిస్టు) అగ్రనేత చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ సహా మొత్తం 9 మంది మావోయిస్టు కేడర్లు రాష్ట్ర పోలీసులకు లొంగిపోయారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్త సమక్షంలో ఈ లొంగుబాట్లు చోటుచేసుకున్నాయి. లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు (సిసిఎం) స్థాయి నాయకుడు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.25 లక్షల బహుమతి, పునరావాసం ప్రభుత్వ సరెండర్ ఢ రీహాబిలిటేషన్ పాలసీ కింద చెల్లూరి నారాయణరావుకు రూ.25 లక్షలు ఇతర కీలక కేడర్లకు రూ.4--5 లక్షల వరకు మిగతా సభ్యులకు రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహకాలు డిజిపి ప్రకటించారు. తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి రూ.20 వేల చొప్పున అందజేశారు. ఈ ఆపరేషన్లలో భారీగా ఆయుధాలు స్వాధీనం పోలీసులు గూఢచారి సమాచారం ఆధారంగా నిర్వహించిన ఆపరేషన్లలో 303 రైఫిళ్లు, బీజిల్ ఆయుధాలు పేలుడు పదార్థాలు, డెటోనేటర్లు కార్డెక్స్ వైర్లు, మాన్‌ప్యాక్స్ మొత్తం 19 ఆయుధాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ప్రతి ఏటా మావోయిస్టులకు భారీ దెబ్బలు తగ్గుతున్నాయి. గత ఏడాది పోలీసుల చర్యల్లో 7 ఎన్‌కౌంటర్లలో 18 మంది మావోయిస్టులు హతం కాగా 81 మంది అరెస్టు అయినారు. 106 మంది లొంగుబాటు

మొత్తం 205 మంది మావోయిస్టులపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలో మావోయిస్టుల ప్రభావం శూన్యానికి పోలీసుల నిరంతర చర్యలతో రాష్ట్రంలో అండర్‌గ్రౌండ్ మావోయిస్టు కేడర్ సంఖ్య శూన్యానికి చేరిందని డీజీపీ వెల్లడించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి), గ్రేహౌండ్స్ బలగాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు. లొంగుబాటుకు కారణాలు ఇవే,లొంగిపోయిన కేడర్లు తెలిపిన కారణాలు కీలక నాయకుల మరణాలు, అరెస్టులు మావోయిస్టు సిద్ధాంతంపై నమ్మకం కోల్పోవడం ప్రజా మద్దతు తగ్గడం ప్రభుత్వ పునరావాస పథకాల ఆకర్షణ తో లొంగిపోతున్నామని తెలిపారు. ఏపీ పోలీసుల వ్యూహాత్మక చర్యలతో మావోయిస్టు ఉద్యమం రాష్ట్రంలో తీవ్రంగా క్షీణించినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# రేకులపల్లిలో వరుస దొంగతనాలు

**- కంటిమీద కునుకు లేదని గ్రామస్తుల ఆవేదన**



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రేకులపల్లి గ్రామంలో గల రాత్రి అయినంక కట్టెలు పట్టుకుని తిరుగుతున్నారు. వాళ్ళు ముసలివారు అనుకునేరు సుమ ముసలివారు కాదు వారి గ్రామాన్ని దొంగల భారీన పడకుండా చూసుకోవడానికి గస్తీ దళ సభ్యులు ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశపడి మోసపోకుమా నిజం మరచి నిద్రపోకుమా అన్న ఒక వ్యాఖ్యకు రేకులపల్లి గ్రామస్తులు ప్రాణం పోశారు. అందరూ కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఊరంతా ఏకమై కులానికొక్కరుగా ప్రతి ఒక్కరు వచ్చిఈ గస్తీ దళం ఏర్పాటు చేసుకోనీ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు గ్రామ వీధుల్లో 20 మంది గ్రూపులుగా ఏర్పడి ఆ గ్రామ వీధుల్లో తిరుగుతూ వారి ఇండ్లకు వారే రక్షణ దారులుగా నిలుస్తూతున్నారు. ఈ సమయంలో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే చర్యలు తప్పవని వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## ఎం ఎం సి పరిధిలో ఆస్తిపన్ను

# చెల్లించని 75 ప్రాపర్టీల సీజ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని 14 సర్కిల్లలో ఆస్తిపన్ను చెల్లించని సుమారు 75 ప్రాపర్టీలను మార్చి నెలలో సీజ్ చేశారని ఎం ఎం సి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి తెలిపారు.ఆస్తి పన్నుఅధికంగా బకాయిపడ్డ 677 ప్రాపర్టీలకు డిస్ట్రెస్ నోటీసులు అందజేశారని తెలిపారు. ఈ ప్రాపర్టీలు రేపటిలోగా ఆస్తిపన్ను చెల్లించనియెడల, ప్రాపర్టీలు సీజ్ చేయబడతాయని తెలిపారు.ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 90 శాతం మాఫీ అమలులో ఉందని, ఆస్తిపన్ను బకాయిదారులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని మార్చి 31 లోగా ఆస్తిపన్ను చెల్లించాలని తెలిపారు.ఏప్రిల్ 1 వ తారీఖు నుండి కూడా ఆస్తిపన్ను వసూలు డ్రైవ్ ఉంటుందని, కానీ బకాయిల వడ్డీ పై 90 శాతం మాఫీ ఉండదని, అప్పుడు వడ్డీతో సహా ఆస్తి పన్ను చెల్లించవలసి ఉంటుందని కమిషనర్ తెలిపారు.

## ఎం ఎం సి పరిధిలోని చెరువులలో

# గుర్రపు డెక్క తొలగింపుకు ముమ్మర చర్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని 43 చెరువులలో గుర్రపుడెక్క తొలగించడానికి చర్యలు ప్రారంభమైనాయి అని ఎం ఎం సి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే అల్వాల్ సర్కిల్ లోని రెండు చెరువులలో, బోడుప్పల్ సర్కిల్లోని ఒక చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పూర్తి అయినది అని తెలిపారు. అల్వాల్, బోయినపల్లి, ఎల్ బి నగర్ సర్కిల్లల్లో ఒక్కో చెరువులో, మౌలాలి సర్కిల్ లో రెండు చెరువులలో, నాచారం సర్కిల్ లో రెండు చెరువులలో, నాగోల్ సర్కిల్ లో 15 చెరువులలో, హయత్ నగర్ సర్కిల్ లో 3 చెరువులలో గుర్రపు డెక్క తొలగింపు చర్యలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఘట్కేసర్ సర్కిల్ లోని 4 చెరువులలో టెండర్ ప్రాసెస్ లో ఉంది అని తెలిపారు.

# యాదగిరిగుట్ట డిప్యూటీఈవో భాస్కర్ శర్మ బదిలీ



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)**యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ వేములవాడ ఆలయానికి బదిలీ అయ్యారు.సోమవారం డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.భాస్కర్ శర్మ బదిలీ కావడంతో యాదగిరిగుట్ట ఆలయ డిప్యూటీ ఈవోగా నవీన్ కుమార్ ను కమిషనర్ నియమించారు.

# బెంగళూరులోని శ్రీ వేంకటేశ్వరాలయంలో వైభవంగా వసంతోత్సవాలు ప్రారంభం



**బెంగళూరు(ప్రశ్న న్యూస్)** నగరంలోని వయ్యాలికావల్‌లో గల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి.ఇందులో భాగంగా మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఆస్థానం చేపడతారు. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది.గృహస్తులు (ఇద్దరు) రూ.1000/- చెల్లించి ఒక రోజు వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఈ సేవలో పాల్గొన్న భక్తులకు ఒక అంగవస్త్రం, రవికె, ఒక పెద్ద లడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేస్తారు.ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ జయంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ప్రభావతి, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై

# శ్రీ సీతారామలక్ష్మణుల విహారం



ఒంటిమిట్ట(ప్రశ్న న్యూస్) శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి విశేషమైన హనుమంత వాహన సేవ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామలక్ష్మణులు తమ ప్రియ భక్తుడైన హనుమంతుని వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుంచి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ ఘనంగా కొనసాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తులలో అగ్రగణ్యుడిగా ప్రసిద్ధిగాంచిన హనుమంతుడు దాసభక్తికి ప్రతీకగా నిలిచారు. రాముడు హనుమంతునికి ఆత్మతత్వాన్ని బోధించినట్లు ప్రాచీన వాఙ్మయం ద్వారా తెలుస్తోంది. భక్తులకు ఆత్మోన్నతిని ప్రసాదించే హనుమంతుని సేవాభావాన్ని స్మరించుకుంటూ స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగారు.ఈ వాహన సేవలో డెప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వేడుకగా వసంతోత్సవాలు ప్రారంభం

**- వట్టి వేరు మండపంలో సేదతీరిన శ్రీవారు, దేవేరులు**

**- వన్య మృగాల నమూనాలతో శోభిల్లిన వసంతమండపం**



**తిరుమలలో(ప్రశ్న న్యూస్)** వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని "ఉపశమనోత్సవం" అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదిస్తారు. ఈ వేడుకల కోసం వట్టివేరుతో ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు. అలాగే వేలాడే కోతులు, ఏనుగులు, సింహాలు, పులులు, నెమళ్లు, పాముల తదితర జంతువులు, పలురకాల చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దారు.ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు.

### వైభవంగా స్నపనతిరుమంజనం

వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు శ్రీ భూ సమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది.ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మధి(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోదకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను వైఖనసాగమోక్తంగా అర్చకులు చేపట్టారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈవో ఎం.రవిచంద్ర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## నవనీత కృష్ణుడిగా అలరించిన

# ఒంటిమిట్ట రామయ్య



**ఒంటిమిట్ట(ప్రశ్న న్యూస్ )** శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. మార్గమంతా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం బాలకృష్ణుడు వెన్నదొంగగా ప్రసిద్ధి. యశోదమ్మ ఇంట్లోనే కాక రేపల్లెలోని ప్రతి ఇంటికీ వెళ్లి వెన్నను ఆరగించేవాడని కథలు చెబుతాయి. ఈ బాలకృష్ణుడి లీలలను స్మరింపజేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్‌తో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ గడ్డి ప్రదీప్

# అభినందనలు తెలిపిన కేటీఆర్

**- గంగుల కమలాకర్ సమక్షంలో కేటీఆర్ ను కలిసిన గడ్డి ప్రదీప్**

**- ప్రజా సేవలో ముందుండాలి - యువ నాయకుడిగా ఎదగాలి - కేటీఆర్**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ కార్పొరేటర్‌గా అఖండ విజయం సాధించిన గడ్డి ప్రదీప్ సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారవు ను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కేటీఆర్ గడ్డి ప్రదీప్‌ను అభినందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా అభివృద్ధి పనులు చేపట్టి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించినట్లు గడ్డి ప్రదీప్ తెలిపారు.అలాగే, యువ నాయకుడిగా ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని కేటీఆర్ ఆకాంక్ష వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.

## మంచి జరగాలంటే
# మనుషులనే నమ్మాలి



'లెజెండ్'ఫేం శరవణన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లీడర్'. లెజెండ్ శరవణన్ స్పోర్ట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి ఆర్ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకుడు. పాయిల్ రాజ్‌పుత్ కథానాయిక. ఏప్రిల్ 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'ఈ ప్రపంచంలో ఏ సహాయం దేవుడు నేరుగా చేయడు.. మనుషుల మూలంగానే అన్ని మంచి పనులు జరుగుతాయి.. మనం వాళ్లనే నమ్మాలి..' అనే డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. హీరో పాత్ర దృక్పథాన్ని తెలియజేసేలా పూర్తి యాక్షన్ మోడ్‌లో ట్రైలర్ సాగింది. తండ్రీ, కూతురు ఎమోషనల్ సీన్స్ మనసును తాకేలా ఉన్నాయి. ఆండ్రియా, బాహుబలి ప్రభాకర్, వీటీవీ గణేష్, ఐశ్వర్య తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఎస్ వెంకటేశ్, సంగీతం: జిబ్రాన్ వైబోధ.

# 'కాసరగోడ్ ఎంబసీ' (జీ 5) సిరీస్ రివ్యూ!



మలయాళంలో రూపొందిన వెబ్ సిరీస్ 'కాసరగోడ్ ఎంబసీ'. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సిరీస్ కీ, అతీష్ నాయర్ దర్శకత్వం వహించాడు. కబీర్ దుహాన్ సింగ్ .. అబూ సలీమ్ .. గోవింద్ పాయ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, ఈ నెల 20వ తేదీ నుంచి 7 ఎపిసోడ్స్ గా 'జీ 5'లో మలయాళంలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి, తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. మంగుళూరులో ఆసిఫ్ – చెమ్ము అనే ఇద్దరు టీనేజ్ కుర్రాళ్లు ఉంటారు. ఆసిఫ్ కి తండ్రి లేకపోవడం వలన, అతని ఆలనా పాలన మేనమామ రజాక్ చూసుకుంటాడు. అనాథ అయిన చెమ్ము, ఆసిఫ్ తో కలిసి పెరుగుతాడు. ఆసిఫ్ తో పాటు అతని మేనమామ షాపులో చెమ్ము పనిచేస్తూ ఉంటాడు. రజాక్ ఈ ఇద్దరితో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయిస్తూ, తక్కువ మొత్తం ఇస్తూ ఉంటాడు. తాము జైలుకు వెళ్లినా అతను పట్టించుకోకపోవడం వాళ్లను ఆలోచనలో పడేస్తుంది. ఆ సమయంలో వాళ్లను బెయిల్ పై రాయ్ థామస్ బయటికి తీసుకుని వస్తాడు. రాయ్ థామస్ ఎవరనేది అప్పుడే ఆసిఫ్ కీ .. చెమ్ముకి తెలుస్తుంది. అతను వాళ్లచే నకిలీ పాస్ పోర్టులు .. స్టాంప్ పేపర్స్ .. తయారుచేయిస్తూ, ఆనందకరమైన జీవితాన్ని అనుభవంలోకి తీసుకొస్తాడు. ఈ కుర్రాళ్ల పనితీరు గురించి కాసరగోడ్ లోని దామోదరరావు ( కబీర్ దుహాన్ సింగ్)కి తెలుస్తుంది. అతను వాళ్లని రప్పించి ఆశ్రయమిస్తాడు. దేశం విడిచి పారిపోవానుకుంటున్న రాజకీయనాయకులకు .. తీవ్రవాదులకు నకిలీ పాస్ పోర్టులు తయారు చేయించడం అతని అక్రమ వ్యాపారాలలో ఒకటి. దామోదరరావును అందరూ 'దాము' అని పిలుస్తుంటారు. అతని ప్రధానమైన అనుచరులుగా 'పింటో' – 'రాజా' ఉంటారు. విమాన ప్రమాదం వలన బయటపడిన ఉగ్రవాదులను వెతుకుతూ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ (దీపక్ పరంబోల్) కాసరగోడ్ చేరుకుంటాడు. అక్కడ ఏం జరుగుతుంది? ఆసిఫ్ – చెమ్ము జీవితాలు ఎలాంటి మలుపు తిరుగుతాయి? అనేక అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న 'దాము' పట్టుబడతాడా? అనేది మిగతా కథ. 'కాసరగోడ్' ను ప్రధానమైన కేంద్రంగా చేసుకుని, నకిలీ పాస్ పోర్టులు ఎలా తయారవుతున్నాయనే అంశం చుట్టూ అల్లుకుంటూ వెళ్లిన కథ ఇది. ఇక్కడి నుంచి చైల్డ్ ట్రాఫికింగ్ .. అక్రమ ఆయుధాల రవాణా జరుగుతున్నాయనేది డైలాగ్స్ పరంగానే చెప్పించారు. నకిలీ పాస్ పోర్టులు తయారు చేయడం అనే అంశాన్నే ప్రధానంగా తీసుకున్నారు. కథ అంతా కూడా ఈ విషయం చుట్టూనే తిరుగుతుంది. నకిలీ పాస్ పోర్టులకు సంబంధించిన వ్యవహారం ఎలా జరుగుతుంది? ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరితో ఎలాంటి లింకులు ఉంటాయి? ఈ మాఫియాలో ఆధిపత్య పోరు ఎలా ఉంటుంది? మాఫియా ముఠాలోకి అడుగుపెట్టిన వాళ్లలో ఎవరి జీవితాలు ఎక్కువగా బలి అవుతుంటాయి? ఇలాంటి ఒక మాఫియా గ్యాంగ్ ను కట్టడి చేయడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్లకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనే అంశాలను ఆవిష్కరిస్తూ వెళ్లారు. చాలామంది కుర్రాళ్లకు టీనేజ్ లోకి అడుగుపెట్టేసరికి కుటుంబ బాధ్యతలు మీదపడుతుంటాయి. వాళ్లకి డబ్బు అవసరమవుతుంది. కుటుంబానికి అండగా నిలబడుతూనే వాళ్లు చిన్నచిన్న ఆనందాలను వెతుక్కోవడం జరుగుతూ ఉంటుంది. అలా తమకి తెలియకుండానే వాళ్లు మాఫియా ఉచ్చులో ఎలా చిక్కుంటారనేది ఈ కథలో ఎమోషన్స్ వైపు నుంచి నడుస్తుంది. ఒక వైపున రాజకీయ నాయకులు .. పోలీసులు .. లోకల్ రౌడీలు .. మాఫియా ముఠా నాయకులు .. ఇలా అన్ని వైపుల నుంచి దర్శకుడు ఈ కథను టచ్ చేస్తూ వెళ్లాడు. అయితే ఏ ట్రాక్ ను కూడా ఇంట్రెస్టింగ్ గా చెప్పలేకపోయారని అనిపిస్తుంది. టీనేజ్ కుర్రాళ్ల జీవితాలు .. వాళ్ల కలలు .. కష్టాలు .. కన్నీళ్లు ఇవేవీ మనసుకు హత్తుకునేలా చూపించలేకపోయారు. సాధారణంగా పోలీస్ ల ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన కంటెంట్ ను మలయాళ దర్శకులు చాలా ఆసక్తికరంగా ఆవిష్కరిస్తారు. కానీ ఈ సిరీస్ విషయంలో ఆడియన్స్ కి ఏమీ అనిపించదు. ఒక వైపు నుంచి పోలీస్ లు .. మరో వైపు నుంచి విలన్ హడావిడి చేస్తుంటారే తప్ప, అక్కడ ఏమీ ఉండదు. ఏదో జరగబోతుందనేట్టుగా బిల్డప్ లు ఉంటాయి .. కానీ ఎక్కడికక్కడ సన్నివేశాలు తేలిపోతూ ఉంటాయి. విలన్ గా కబీర్ దుహాన్ సింగ్ ను ఒక రేంజ్ లో చూపించారు. కానీ ఆయన పాత్రను పవర్ఫుల్ గా డిజైన్ చేయడకపోవడం వలన, పేలవంగా అనిపిస్తుంది. ఈ మాత్రం దానికి కబీర్ దుహాన్ సింగ్ అవసరమా? అని కూడా అనిపిస్తుంది. ప్రధానమైన కథాంశాన్ని బలంగా చెప్పలేకపోవడం .. చుట్టూ ఉన్న పాత్రలను ఆసక్తికరంగా ఆవిష్కరించలేకపోవడం మైనస్ గా అనిపిస్తుంది. రాజేశ్ రామన్ ఫొటోగ్రఫీ .. రతీష్ వేగ నేపథ్య సంగీతం .. జిలిన్ జోసెఫ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. టీనేజ్ కుర్రాళ్లతో పాటు సీనియర్ ఆర్టిస్టులు తమ పాత్రల పరిధిలో నటించారు. కథాకథనాల పరంగా ఈ సిరీస్ చాలా వీక్ గా కనిపిస్తుంది. పాత్రను డిజైన్ చేసిన విధానం .. సన్నివేశాలను ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ప్రభావితం చేయలేకపోయింది. ఓ మాదిరి కంటెంట్ గా చెప్పుకోవచ్చు అంతే.



# ఇది నా రెండేళ్ల కష్టం

పాత్ర కోసం సర్వశక్తులూ ఒడ్డి శారీరకభాషను మార్చుకోవడం నేటి కథానాయకులకు పరిపాటైంది. 'బైకర్' సినిమాలో 18ఏండ్ల వయసున్న రేసర్‌గా శర్వానంద్ కొన్ని నిమిషాలు కనిపించాలి. దానికోసం తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నారు శర్వానంద్. 'ఉదయం సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం, లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన వ్యాయామాలతో శరీరకంగానే కాదు, మనసికంగా కూడా బలంగా మారాను' అని శర్వానంద్ అన్నారు. ఈ ప్రయాణంలో విజయం సాధించేందుకు యోగా తనకు ఉపయోగపడిందని, దీంతో బరువు తగ్గి మరింత షార్ప్‌గా తయారయ్యానని శర్వా చెప్పారు. 'బలమైన నిర్ణయం ముందు, నిరాశ, నిస్పృహలు నిలువలేవన్న నిజం ఈ రెండేళ్ల ప్రయాణంలో నాకు అర్థమైంది. ఇది నటన కాదు.. నా రెండేళ్ల కష్టం. మారాలనే పట్టుదల ఫలితాన్ని రేపు తెరపై చూస్తారు' అని నమ్మకంగా చెప్పారు శర్వానంద్. ఏప్రిల్ 3న 'బైకర్' విడుదల కానున్న విషయం తెలిసిందే.

# పాట కోసం
## భాగ్యనగరంలో భారీ సెట్



తన గత చిత్రాలకు భిన్నంగా శరవేగంగా 'వారణాసి' చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 60శాతం పూర్తయింది. వచ్చే నెల తొలివారం నుంచి ఈ సినిమాకు సంబంధించిన కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాలపై ఓ పాటను ప్లాన్ చేశారు రాజమౌళి. ఈ పాట కోసం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఓ భారీ సెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ సాంగ్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయని వినికిడి. భారతీయ పురాణ, ఇతిహాసాల నేపథ్యంలో సాగే ఈ సినిమా కథలో, అడ్వెంచర్లకు కొదవ ఉండదని, ట్రజర్ హంట్ కూడా ఈ కథలో కీలకమైన భాగమని ఇన్‌సైడ్ టాక్.

ఈ సినిమాలోని కొంతభాగం మహేశ్ శ్రీరామచంద్రుడిగా కనిపించనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన షూటింగ్‌ని కూడా రాజమౌళి పూర్తి చేశారు. 1300కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పాన్‌వరల్డ్ గ్లోబల్ అడ్వెంచర్‌ని రెండు భాగాలుగా విడుదల చేయాలనే ఆలోచనలో కూడా మేకర్స్ ఉన్నట్టు తెలిసింది. 2027 ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ చిత్రంలో ప్రతినాయకునిగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కథ: వి.విజయేంద్రప్రసాద్, మాటలు: దేవకట్టా, కెమెరా: పీఎస్ వినోద్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: కె.ఎల్.నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్.

## రొమాంటిక్‌గా
# గూగుల్ మై ఫ్రెండ్



ప్రణవ్‌రావ్, రాణి, ప్రజక్త గైక్వాడ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న యువతరం సినిమా 'గూగుల్ మై ఫ్రెండ్'. గోవింద్ వరాహ దర్శకుడు. దివాకర్‌రెడ్డి నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా సాంగ్స్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, దర్శకులు వి.సముద్ర, శైలేష్ కొలను, కొండా విజయ్‌కుమార్, సాయిరాజేశ్ పాటలను ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. నిర్మాతల సహకారం వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చిందని, పాటలను ఆవిష్కరించిన తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలని దర్శకుడు గోవింద్ వరాహ అన్నారు. సియా రేవాడ్కర్, అశ్విని కులకర్ణి, మాధవ్ అభ్యంకర్, సి.దివాకర్‌రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిషన్ సాగర్, సంగీతం: ఎస్.సాగర్, కార్తీక్, లిరిక్ జాన్సన్, నిర్మాణం: డాలర్స్ మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్స్.

# స్పెషల్ సాంగ్‌లో ఫేమస్ సింగర్
## - ఈ 'చిచ్చుబుడ్డి' బ్యూటీ ఎవరో తెలుసా?



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ డెకాయిట్. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన స్పెషల్ సాంగ్ 'చిచ్చుబుడ్డి' యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. అడివి శేష్ స్టెప్పులు వేయడం చాలా తక్కువ. ఐటం సాంగ్స్, మాస్ సాంగ్స్‌కు ఆమడ దూరంలో ఉండే ఆయన ఈ స్పెషల్ సాంగ్‌లో బ్యూటీతో కలిసి డ్యాన్స్ అదరగొట్టారు. ఈ వీడియోలో ఎనర్జీ స్టెప్పులతో ఊపేసిన బ్యూటీపై అందరి దృష్టి పడింది. నెట్టింట ఆమె గురించి తెగ సెర్చ్ చేస్తున్నారు. ఆ బ్యూటీ ఎవరో కాదు ఫేమస్ సింగర్ జోనితా గాంధీ.'భూమ్ భూమ్ భూమ్ భూమరాంగూ... ఎగరేస్తా పట్టుకోండి చీరకొంగు...' అనే లిరిక్స్‌తో సాంగ్ ప్రారంభం కాగా... ఈ పాటను జోనితా గాంధీనే పాడారు. ఇదే పాటలో అడివి శేష్‌తో స్టెప్పులు వేస్తూనే గాత్రం అందించారు. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా... రామ్ మిరియాల, జోనితా గాంధీ పాడారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందించారు. దేశ రాజధాని ఢిల్లీలో జోనితా గాంధీ పుట్టగా... ఆమెకు 9 నెలల వయసున్నప్పుడే ఆమె కుటుంబం టొరంటోకి వెళ్లిపోయారు. ఏడేళ్ల వయసు నుంచే మ్యూజిక్‌పై ఇష్టంతో పాటలు పాడేవారు.

ఆ తర్వాత అలా సాధన చేస్తూ తన మ్యూజిక్ ఆల్బమ్స్ యూట్యూబ్‌లో పెట్టేవారు. వాటికి మంచి రెస్పాన్స్ రావడంతో ఆమె అడుగులు సింగింగ్ వైపు పడ్డాయి. అది కెరీర్‌గా మలుచుకునేందుకు తిరిగి భారత్ వచ్చారు జోనితా. ఆమె అప్పటికే చేసిన మ్యూజిక్ ఆల్బమ్స్ మ్యూజిక్ డైరెక్టర్స్‌ను ఆకట్టుకున్నాయి. అలా, బాలీవుడ్ మూవీ షారుఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్ ప్రెస్'లో పాట పాడే ఛాన్స్ దక్కింది. ఆ పాటను ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంతో కలిసి పాడడంతో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. అలా జోనితాకు వరుస అవకాశాలు దక్కాయి. ఏఆర్ రెహమాన్, అమిత్ త్రివేది, ప్రీతమ్ వంటి వారు మ్యూజిక్ అందించిన సినిమాల్లో వరుసగా పాటలు పాడి మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. జోనితా గాంధీ తెలుగులోనూ పాటలు పాడారు. ఓకే బంగారం సినిమాలో మెంటల్ మదిలో, బీస్ట్ మూవీలో హలమతీ హబీబో, కిక్ 2లో నువ్వే నువ్వే ప్రాణం, లవ్ స్టోరీ సినిమాలో ఏవో ఏవో కలలే, సర్కారు వారి పాట మూవీలో మ మ మహేశా పాట పాడి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. హిందీతో పాటు కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లోనూ పాటలు పాడారు.

ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆమె... తన పాటల వివరాలు, ఫోటోలు, లైవ్ కాన్సెర్ట్స్ వివరాలు అభిమానులతో షేర్ చేసుకుంటుంటారు. తమిళ మూవీ వాకింగ్ టాకింగ్ స్ట్రాబెర్రీ ఐస్ క్రీమ్‌లోనూ నటించారు. తాజాగా డెకాయిట్‌లో సింగర్‌గా మాత్రమే కాకుండా డ్యాన్సర్‌గానూ అదరగొట్టారు. షానిల్ డియో దర్శకత్వం వహించిన ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సహారా డిపాజిటర్లకు వెంటనే
# న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి

**- బోయినిపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా**

**- సీపీఎం పార్టీ మండల కన్వీనర్ : గురిజాల శ్రీధర్**




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** సహారా ఇండియా గ్రూప్‌లో డబ్బులు పెట్టిన డిపాజిటర్లకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే చెల్లింపులు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం బోయినిపల్లి మండల కేంద్రంలోని మండల తహసీల్దార్ అధికారి కార్యాలయం ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సహారా బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ, అధిక వడ్డీ ఆశతో స్థానిక ప్రజలు సహారా ఇండియా గ్రూప్‌లో తమ కష్టార్జిత సొమ్మును డిపాజిట్ చేశారని తెలిపారు. అయితే 2023 నవంబర్‌లో సహారా గ్రూప్ అధినేత సుబ్రత రాయ్ మరణం అనంతరం సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో డిపాజిటర్లకు తీవ్ర నష్టం కలిగిందన్నారు.డిపాజిట్ గడువు పూర్తయినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించగా, 2023 మార్చి 29న సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసి, కంపెనీ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఏడాది లోపు డిపాజిటర్లకు చెల్లింపులు చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనవసరమైన నిబంధనలు, షరతులు విధిస్తూ చెల్లింపులు ఆలస్యం చేస్తోందని విమర్శించారు.సహారా కార్యాలయాల వద్ద తిరుగుతూ బాధితులు విసుగుచెందారని, ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే అన్ని డిపాజిటర్లకు డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సహారా బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రామంచ అశోక్, సిపిఎం పార్టీ నాయకులు కుడుకల గిరిబాబు, దూస జనార్ధన్, అలాగే సహారా బాధితులు వాసాల నరసయ్య,ధ్యావ విజయ, పాముల సత్తవ్వ, భీమనాథుని ఆంజనేయులు, మ్యాన అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో పోరాడుతున్న
## నిరుపేద బాధితునికి ఎమ్మెల్యే సత్యం అండ

**- నిమ్స్‌లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రామన్నపేట గ్రామానికి చెందిన దాసరి రాజు తీవ్ర అనారోగ్యంతో జీవన పోరాటం చేస్తున్నారు. షుగర్ వ్యాధి కారణంగా కాలుకు ఇన్ఫెక్షన్ రావడంతో ఒక కాలును తొలగించాల్సి వచ్చిన ఆయన, ప్రస్తుతం మరో కాలుకు కూడా ఇన్ఫెక్షన్ సోకడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయాన్ని స్థానిక నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి బాధితుడికి అండగా నిలిచారు. మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)మంజూరు చేశారు.ఎమ్మెల్యే అందించిన ఈ సహాయం పేద కుటుంబానికి పెద్ద ఊరటనిచ్చిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. మేడిపల్లి సత్యం చేసిన సహాయానికి రామన్నపేట గ్రామ ప్రజలు, బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సత్యం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధిలో
# వార్డు సభ్యుల పాత్ర కీలకం

**- వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్**

**- వార్డు సభ్యుల హక్కుల కోసం పోరాటం -- వేతనాలు, ఇన్సూరెన్స్‌లపై డిమాండ్**

**- కరీంనగర్‌లో వార్డు సభ్యుల కీలక సమావేశం**



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్డు సభ్యుల ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు తక్షణమే గౌరవ వేతనాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వార్డు సభ్యులు నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ వారికి ఎలాంటి ఆర్థిక భద్రత లేకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు వేతనాలు పొందుతున్నప్పటికీ వార్డు సభ్యులు మాత్రం నిర్లక్ష్యం చేయబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా వార్డు సభ్యులకు ప్రత్యేక ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించాలని, వారి సేవలకు గౌరవం పెంచేలా ప్రత్యేక హక్కులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీదేవి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు నవీన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అమ్మిగల్ల గోపాల్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుముల నవీన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి బత్తిని అనిల్ గౌడ్, అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్, రాష్ట్ర ప్రముఖ సలహాదారు గడప కోటేష్ కుమార్, గౌరవ సలహాదారు కొలుగూరి సూర్య కిరణ్, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర వెంకటరమణ – జమున తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో పరిశ్రమలలో
# అగ్ని ప్రమాదల నివారణకు చర్యలు చేపట్టాలి

**- ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక**

**- జిల్లాలో పటిష్టంగా అమలు కావాలి. - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) వేసవికాలం పరిశ్రమలలో అగ్ని ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు ను పరిశ్రమల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అనుమతులను నిర్ణీత గడువు లోగా మంజూరు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. జిల్లాస్థాయి రాయితీలను మంజూరు చేయడం జరిగింది. వేసవి కాలంలో పరిశ్రమలు ఎటువంటి అగ్నిప్రమాదాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కర్మాగార శాఖ అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో అమలు కావాలని మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కర్మగారా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీలో
# ధర్పల్లి విద్యార్థుల ఘనత

**- జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో మొదటి రెండవ బహుమతులు**




**దర్పల్లి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ధర్పల్లి ఎన్ఎస్ఎస్ రెడ్ రిబ్బన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి హెచ్ఐవి ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ధర్పల్లి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన,పోస్టర్ మేకింగ్ లో జిల్లా స్థాయిలో మొదటి, రెండో బహుమతి ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ జ్యోతి, విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అపర్ణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల నుండి ఎన్ఎస్ఎల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం కుమారస్వామి, డాక్టర్ సిహెచ్ రామచందర్ పాల్గొన్నారు.

## దర్పల్లి మండలం చల్లగర్గలో చలివేంద్రం




**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** ధర్పల్లి మండల్ చల్లగర్గ గ్రామం జి పి ఆధ్వర్యం లో దర్పల్లి ఎంఆర్ఓ శాంత చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడు తూ ఎండాకాలం వస్తుంది ప్రతి ఒక్కరికి నీరు అవసరం కాబట్టి ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఓ శాంత, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ మంత్రిని కలిసిన మాజీ కాంగ్రెస్ పార్టీ
# అధ్యక్షుడు సెగ్గం రాజేష్

- కాంగ్రెస్ పార్టీనే పరమావధిగా సేవ చేసి ఆయన జీవితా లక్ష్యాన్ని నెరవేర్చుకున్న జీవిత ఫోక్ పర్సన్ సేగ్గం రాజేష్.
- ఏ పార్టీలోనైనా రాజేష్ అన్నకు నచ్చక తన సొంత గూటికే చేరుకొనా.



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలోని రామునికి ఉడుత సాయం చేసినట్టుగా శ్రీధర్ బాబుకు శఘ్యం రాజేష్ కూడా అలానే సాయం చేస్తూ తన సొంత గూటికి చేరుకున్నాడు. శ్రీపాదరావుకు నమ్మిన బంటుగా సేవ చేస్తూ శ్రీపాదరావు నోటిలో నాలికలాగా మెదులుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి గొప్ప కార్యకర్త సెగ్గం రాజేష్. మంథని మారుమూల అటవీ ప్రాంతమైన నియోజకవర్గంలోని అడవి సోమనపల్లి గ్రామంలో పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్టుగా సెగ్గం రాజేశం కాంగ్రెస్ పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసి పేద ప్రజల మన్ననలు పొంది శ్రీపాదరావు అనుచరునిగా మంచి పేరు సంపాదించుకున్న నికాసైన నిజమైన కార్యకర్త అని పేరు తెచ్చుకున్నాడు . అదేవిధంగా శ్రీధర్ బాబు శీను బాబు నాయకత్వంలో పనిచేసి ఎందరోకో మాయమాటలకు మోసపోయి ఇటీవల కాలంలో వేరే పార్టీల చేరిన దాన్లో ఇమ్మడించుకోక తన సొంత గూటికే చేరుకున్న మొదటి వ్యక్తి సెగ్గం రాజేష్ ఇదంతా కాంగ్రెస్ పార్టీ అంటే పేద ప్రజల పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని గుర్తించి మళ్లీ కాంగ్రెస్ పార్టీలో సేవలందించడానికి మునుముందుకు సాగి శ్రీధర్ బాబు ఆశీస్సులతో శీను బాబు ప్రేమతో పెద్దపెల్లి జిల్లా అధికార పార్టీ ప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కార్యకర్తగా కొనసాగుతున్నారు.

## రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమలల్లో పాల్గొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలియజేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు.అనంతరం వారు మాట్లాడుతూ...ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు..గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందనిస్పష్టంచేశారు..

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేశం, జిల్లా కార్యదర్శి రవీందర్, రామా గౌడ్, గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, సర్పంచులు సురేష్ నాయక్, యాదగిరి గౌడ్, సీనియర్ నాయకులు సుధీర్ కుమార్ గౌడ్,మన్నే శ్రీనివాస్,నర్సింలు, ఆంజనేయులు,మోహన్ దాస్ గౌడ్, వార్డు సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## సింగూర్ నుంచి ఘనపూర్‌కు 0.3 టీఎంసీ నీరు
## విడుదల చేయాసీ వెంటనే రైతులను ఆదుకోవాలి.

**- తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** సింగూర్ ప్రాజెక్ట్ నుండి ఘనపూర్ రాయకట్టకు 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సంవత్సరం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసి రెండు పంటలు పండించే అవకాశం కల్పించారని తెలిపారు. ఘనపూర్ ఆయకట్ట పరిధిలో ఎఫ్ఎం, ఎఫ్ఎన్ కాలువల ద్వారా మూడు మండలాలకు సాగునీరు అందుతూ రైతులు పుష్కలంగా పంటలు పండించుకునేవారని చెప్పారు. ప ం డి ం చి న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నదని గుర్తుచేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఈ సీజన్‌లో సింగూర్ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు.రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపురం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. పంటలు పొట్టదశలో ఉన్నందున వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు హెచ్చరించారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు
# కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**- యువత మత్తుకు బానిస కావొద్దు, ఉజ్వల భవిష్యత్తును పాడుచేసుకోవద్దు**

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ( ప్రశ్న న్యూస్)** మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మత్తు పదార్థాల నియంత్రణపై విద్యా, వ్యవసాయ, ఎక్సైజ్, పోలీసు, వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు/కళాశాలల్లో మత్తు పదార్థాల నివారణపై పెయింటింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు అవగాహన,కల్పించాలన్నారు.

రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాల ఏర్పాటుతో సమాజంలో మార్పు తీసుకురావచ్చున్నారు. మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, దాబాల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు.యువత మత్తుకు బానిస కావొద్దని, ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ సమావేశంలో డీఏఓ అంబికా సోనీ, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్ ల, డీఎంహెచ్ఓ మల్లిఖార్జున రావు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి: జర్నలిస్టుల వినతిపత్రం




కాప్రా(ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో కాప్రా సర్కిల్ నందు కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టులు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాప్రా సర్కిల్ పరిధిలో ఒక అక్రమ నిర్మాణాన్ని రెండుసార్లు సీజ్ చేసినప్పటికీ, దానిపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా నిర్మాణదారుడు పనులను పూర్తిచేయడం మున్సిపల్ చట్టాల పట్ల అవమానకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు ప్రజల్లో ప్రభుత్వ చట్టాలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించిన కాప్రా సర్కిల్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతిపత్రంపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి వెంటనే నివేదిక సమర్పించాలని ఎంఎంసి సిసిపి ప్రదీప్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

## నగదు లభ్యత పెంచేందుకు ఆర్బీఐ చర్యలు

**- బ్యాకింగ్ వ్యవస్థలోకి రూ.84 వేల కోట్లు ప్రవేశపెట్టిన ఆర్బీఐ**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను (లిక్విడిటీ) పెంచేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) సోమవారం కీలక చర్యలు చేపట్టింది. రెండు వేరియబుల్ రేట్ రెపో (వీఆర్ఆర్) వేలాల ద్వారా మొత్తం రూ. 84,582 కోట్లను వ్యవస్థలోకి చొప్పించింది. ఆర్థిక వ్యవస్థలో నిధుల ప్రవాహాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత వీఆర్ఆర్ వేలంలో రూ. 50,001 కోట్లను 5.44 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు విడుదల చేసింది. ఆ తర్వాత నిర్వహించిన మరో వేలంలో రూ. 34,581 కోట్లను 5.30 శాతం వెయిటెడ్ యావరేజ్ రేటుకు బ్యాంకులకు అందించింది. మొదటి వేలానికి మంచి స్పందన రాగా, రెండో వేలానికి అడిగిన మొత్తం కంటే తక్కువ బిడ్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో మార్చి 27 నాటికి సుమారు రూ. 1.27 లక్షల కోట్ల మిగులు నిధులు ఉన్నాయని అంచనా. గత కొన్ని రోజులుగా వీఆర్ఆర్ వేలాల ద్వారా ఆర్బీఐ రూ. 2,73,530 కోట్ల తాత్కాలిక ద్రవ్య లభ్యతను కల్పించింది. అంతకుముందు, 2026 జనవరి నుంచి ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల (ఓఎంఓ) ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి రూ. 3.50 లక్షల కోట్ల శాశ్వత ద్రవ్య లభ్యతను పెంచింది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో (ఏప్రిల్-సెప్టెంబర్) చేపట్టనున్న రుణ సేకరణ వివరాలను ప్రకటించింది. ఆర్బీఐతో సంప్రదింపుల తర్వాత తొలి ఆరు నెలల్లో రూ. 8.20 లక్షల కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఈ రుణాలను డేటెడ్ సెక్యూరిటీలు, సావరిన్ గ్రీన్ బాండ్ల జారీ ద్వారా సేకరించనుంది.

## శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా

**- హైదరాబాద్‌లో భారీ రాకెట్ గుట్టురట్టు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో భారీ అక్రమ గ్యాస్ సిలిండర్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, ఈ దందాకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సోమవారం ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అధిక లాభం కోసం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ. 21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి. ఇతను బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ కేజీల బరువున్న సిలిండర్లు, డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దేవాదాయ శాఖలో బ్యాక్‌డోర్ ఉద్యోగాల దందా.?

- నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ ఎలా జరుగుతోంది - అధికారుల కనుసైగల్లో బహిరంగ రహస్యమే
- కనీస విద్యార్హతలు లేకున్నా అధికారులుగా చలామణి
- కొంతమంది సిబ్బంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలు
- దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ వెంటనే పూర్తిస్థాయి విచారణ చేయించాలని భక్తుల విన్నపం

**(గౌటి రామకృష్ణ -- ప్రశ్న న్యూస్)**






తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ శాఖలో జరుగుతున్న ఉద్యోగాల దందా ఇప్పుడు బహిరంగ రహస్యంగా మారింది. నిబంధనలు, అర్హతలు, పారదర్శకత అన్న మాటలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ఎలాంటి నియామక ప్రక్రియ పాటించకుండా, వెనుక ద్వారాల ద్వారా ఉద్యోగాలు కేటాయించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం పరిపాలనా లోపమే కాకుండా వ్యవస్థపరమైన అవినీతికి నిదర్శనంగా మారింది. దేవాలయాలు ప్రజల విశ్వాసానికి ప్రతీకలు. అలాంటి పవిత్ర స్థలాల నిర్వహణలో పనిచేయాల్సిన వారు పోస్టుకు తగ్గ అర్హతలు, నియమాలు పాటించవాల్సింది పోయి, డబ్బు ఉన్నవారికి ఉద్యోగాలు అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో పోస్టుకు 5 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తున్నారన్న ప్రచారం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. దేవాదాయ శాఖలో జరుగుతున్న అవినీతి కాకుండా భక్తుల నమ్మకంపై దెబ్బగా భావించాల్సిందే అని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కనీస విద్యార్హతలు లేని వ్యక్తులు కూడా ఉద్యోగాలలో చేరుతున్నారన్న సమాచారం నిరుద్యోగులను మరింత కలవరపెడుతోంది. జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆర్థిక ఇబ్బందులు తట్టుకొని పీజీలు చదివితే నోటిఫికేషన్లు వెయ్యకుండా దేవాదాయ శాఖలో లోలోపల భర్తీ చేయడం పై నిరుద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అర్హతలున్న నిరుద్యోగులు నిరాశలో మునిగిపోతుంటే, డబ్బు ఉన్నవారికి అవకాశాలు కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధం జరుగుతుంది. ప్రభుత్వ శాఖలో ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేయడం కానీ ఇప్పుడు అది వ్యాపారంగా మారిందన్న భావన బలపడుతోంది. ఈ వ్యవహారంలో ఉన్నత అధికారులు, మధ్యవర్తులు కలిసి వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### లంచాలు పెట్టాలి, లోలోపల ఉద్యోగం కొట్టాలి


దేవాదాయ శాఖలో ఉద్యోగాల కోసంనోటిఫికేషన్ ఇవ్వకుండా, ఎలాంటి రాతపరీక్షలు లేకుండా, ఇంటర్వ్యూలు లేకుండా ఉద్యోగాలు ఎలా కేటాయిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ పై ఉంది. అయితే ఇప్పటివరకు ఈ ఆరోపణలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్నట్టు కనిపించడం లేదని విజిలెన్స్ విభాగం ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇలాంటి పెద్ద స్థాయి అవినీతి ఆరోపణలు ఉన్నప్పుడు, తక్షణమే సిబిసిఐడి చే విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ ఇప్పటివరకు నిశ్శబ్దంగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన దేవాదాయ శాఖలో ఈ తరహా అక్రమాలు కొనసాగితే, భవిష్యత్తులో మరింత పెద్ద సమస్యలకు దారితీయెచ్చు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి, పారదర్శక విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే చదువుకోవాల్సిన అవసరం లేదు అనే భావన పూర్తిగా వ్యాప్తి చెందడం ఖాయం. ఇప్పటికైన అయిన కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని చర్యలు తీసుకుంటుందా.? లేక ఈ అవినీతి దందాను గాలికి వదిలేస్తుందా.? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన సమయం రేవంత్ రెడ్డి సర్కార్ పై ఉంది.

# అశుభ్రానికి నిలయంగా అమీర్‌పేట్ సర్కిల్

- మూత్రశాలల దుస్థితి, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- నిర్వాహనిధులు ఏ అధికారి జేబుల్లోకి
- కార్యాలయమే సక్రమంగా నిర్వహించలేని అధికారులు ఇక సమాజం పరిస్థితి ఏమిటి
- పరిపాలన చేయడంలో పూర్తిగా విఫలమవుతున్న జోనల్ కమిషనర్, జిహెచ్‌ఎంసి కమిషనర్














**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అమీర్పేట సర్కిల్ కార్యాలయం ప్రస్తుతం అశుభ్రతకు అడ్డాగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యాలయం స్వయంగా చెత్తకుప్పగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కార్యాలయంలోని మూత్రశాలల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండటం అక్కడికి వచ్చే ప్రజలనే కాదు, సిబ్బందినీ తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. మూత్రశాలల్లో శుభ్రత అనే మాటే కనిపించడం లేదు. గోడలు మురికితో కప్పబడి ఉండగా, దుర్వాసనతో లోపలికి వెళ్లడం కూడా కష్టంగా మారింది. నీటి సరఫరా లేకపోవడం, సరైన శుభ్రపరిచే చర్యలు లేకపోవడం వల్ల పరిస్థితి రోజురోజుకూ పరిస్థితి పూర్తిగా దిగజారుతోంది. ఇది ఒక ప్రభుత్వ కార్యాలయానికి తగిన స్థితి కాదని ప్రజలు మండిపడుతున్నారు. కార్యాలయం పరిసరాలు కూడా అంతే దారుణంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, పాడైన ఫర్నిచర్, పాత సామాన్లు పేరుకుపోయి ఉన్నాయి. వాటిని తొలగించడానికి అధికారులు, సిబ్బంది ఎవరూ ముందుకు రావడం లేదు. కార్యాలయానికి వచ్చామా, కొంచెంసేపు కూర్చున్నామా, ఫీల్డ్ వర్క్ అని బయటికి వెళ్ళామా అన్నట్లుగా మారింది ప్రభుత్వ అధికారుల, సిబ్బంది వ్యవహారం. ఇలాంటి అత్యంత అద్వాన్న పరిస్థితుల్లో ఉన్న సర్కిల్ కు ప్రజలు తమ పనుల కోసం కార్యాలయానికి రావాల్సి రావడం దురదృష్టకరం.

### ఇంజనీరింగ్ అధికారుల పూర్తి నిర్లక్ష్యం

సర్కిల్ కార్యాలయాలని మెయింటెన్ చేయాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులు కానీ జిహెచ్‌ఎంసి పరిధిలో సర్కిల్ల నిర్వహణ అత్యంత దారుణంగా మారుతుంది ఇంజనీరింగ్ అధికారులు నిధులను తమ జేబుల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అధికారులు, మెయింటెనెన్స్ సిబ్బంది పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయల నిర్వహణలో అధికారులు కనీస బాధ్యత కూడా తీసుకోకుండా కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కార్యాలయాన్ని సక్రమంగా నిర్వహించలేని అధికారులు ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 99 రోజుల ప్రజా పాలన, పట్టణ ప్రగతి ప్రభుత్వ కార్యాలయాలకు వర్తించదా.?

ప్రభుత్వం ఎంతో ప్రాచుర్యం చేస్తున్న "99 రోజుల ప్రజా పాలన, పట్టణ ప్రగతి" కార్యక్రమం చేపట్టినప్పటికీ, అమీర్పేట సర్కిల్‌లో మాత్రం అది అమలవుతున్నట్టు కనిపించడం లేదు. కాగితాలపై మాత్రమే కార్యక్రమాలు కొనసాగుతున్నాయే కానీ, వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత సర్కిల్ కార్యాలయాన్ని శుభ్రపరచుకోలేని అధికారులు ఇక సర్కిల్ పరిధిలో ఉన్న కాలనీలను బస్తీలను ఎలా శుభ్రపరస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ సిబ్బంది, అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ డ్యూటీలు నిర్వహిస్తున్నారనే అభిప్రాయం బలపడుతోంది. ప్రజల సమస్యలపై స్పందన లేకపోవడం, ఫిర్యాదులను పట్టించుకోకపోవడం వంటి అంశాలు మరింత అసంతృప్తికి దారి తీస్తున్నాయి. పాలకులు ఈ పరిస్థితిని గమనిస్తున్నారా లేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం అన్ని కలగలిపి అమీర్పేట సర్కిల్ కార్యాలయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ప్రజలకే భారంగా మారడం అత్యంత విచారకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, జిహెచ్‌ఎంసి కమిషనర్ మేల్కొని డ్యూటీ పట్ల నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కార్యాలయాన్ని శుభ్రపరిచి, పరిశుభ్రంగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఖైరతాబాద్ జూన్ పరిధిలో ఉన్న సర్కిల్లో ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కారం పొందుతాయో, ఈ నిర్లక్ష్యానికి ఎప్పుడు ముగింపు పడుతుందో అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588